# లూథరన్ ఆరాధన క్రమము

## చిన్న ప్రశ్నోత్తరి

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను,

సత్యముతోను ఆరాధింపవలెను" యోహాను 4:24.

క్రైస్ట్ ఇవాంజిలికల్ లూథరన్ మినిస్ట్రీస్

# విషయ సూచిక


పేజి నెం.

† పరిశుద్ధ బాప్తిస్మ సంస్కార ఆరాధన క్రమము 5

† అత్యవసర బాప్తిస్మ సంస్కార క్రమము 9

† సామాన్య ఆరాధన క్రమము 10

† పరిశుద్ధ ప్రభురాత్రి భోజన సంస్కార ఆరాధన క్రమము 17

† లూథరు చిన్న ప్రశ్నోత్తరి : 24

1. పది ఆజ్ఞలు 24

2. అపొస్తలుల విశ్వాస ప్రమాణము 27

3. ప్రభువు ప్రార్థన 29

4. పరిశుద్ధ బాప్తిస్మ సంస్కారము 32

5. పరలోకపు తాళపు చెవుల ఉపయోగము మరియు ఒప్పుకోలు 34

6. పరిశుద్ధ ప్రభురాత్రి భోజన సంస్కారము 37

† క్రైస్తవునికి ప్రశ్నలు 39

† కీర్తనలు 43

# పరిశుద్ధ బాప్తిస్మ సంస్కార ఆరాధన క్రమము

*(ఈ క్రమము పరిశుద్ధ బాప్తిస్మమును పాపపు ఒప్పుకోలుతో చేర్చి సంఘూరాధన యందు వాడబడు చున్నది. పాపపు ఒప్పుకోలును పాపక్షమాపణను పొందుటయు బాప్తిస్మమునందు తిరిగి జన్మించుట మాత్రము కాక మరేదియు కాదని మార్టిన్ లూథర్ చెప్పెను. అందుచేత యీ క్రమము బాప్తిస్మము నాచరించుటయే కాక బాప్తిస్మము నందున్న శాశ్వత దీవెనలు జ్ఞాపకము చేయుటకు కూడా వాడబడుచున్నది)*

*(ఒక బాప్తిస్మపు కీర్తన పాడవచ్చును. సంఘము కూర్చుని యుండును)*

**పాష్టరు :** *(సంఘం వైపు)* మన ప్రభువైన † యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీతో నుండునుగాక.

సంఘం : **మీతో కూడ నుండునుగాక.**

**పాస్టరు :** *(సంఘం వైపు)* "మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి, తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి." అని మన రక్షకుడైన యేసుక్రీస్తు బాప్తిస్మ విషయములో ఆజ్ఞ యిచ్చెను. మనమందరమును బాప్తిస్మము ఎంతగనో పొందవలసిన అవసరముతో యీ లోకములో జన్మించితిమి. మన తల్లి దండ్రుల యొద్ద నుండి పాప స్వభావమును వారసత్వముగ పొందితిమి. దేవుని గూర్చి నిజమైన భయమైనను, ఆయనయందు నిజమైన విశ్వాసమైనను లేక, మనమందరము నిత్య మరణమునకు ఖండించబడినవారివలె నుంటిమి. కానీ, యేసుక్రీస్తు సిలువ మీద తన ప్రాణము నర్పించుటచే, మన పాపమంతటిని ఆయన తీసివేసెను. మన బాప్తిస్మమునందు మన పాప జీవితము మనలను యిక యెన్నడును ఏలనవసరములేదు.

ఈ క్రింది మాటలు పలుకుచు మన అనుదిన జీవితములో బాప్తిస్మము ఏమైయున్నదో మనము జ్ఞాపకమునకు తెచ్చుకొనుచున్నాము.

సంఘం: బాప్తిస్మమనగా మనము ప్రతి దినము మన పాపమునకైన దుఃఖము నందును, పశ్చాత్తాపమునందును మనలోని పాప స్వభావము ముంచబడవలెననియు, మన దుష్ట కార్యములు, ఆశలు సమాధి చేయవలెనని అర్థము. నూతన పురుషుడు మనయందు ప్రతి దినము సజీవియై, పవిత్రతయందును పరిశుద్ధతయందును నిత్యము దేవుని సన్నిధిలో నిలువవలెననియు కూడా భావనయై యున్నది.

పాస్టరు : *(సంఘం వైపు)* బాప్తిస్మము పొందిన దేవుని పిల్లలుగా మన పాపములను ఒప్పుకొందము.

*(సంఘం మోకరించవచ్చును)*

## పాపపు ఒప్పుకోలు

అందరు : *(అల్టరువైపు)* కనికరముగల పరిశుద్ధుడవైన తండ్రీ, నేను స్వాభావికముగా పాపిననియు, నా తలంపులయందు, మాటలయందు, క్రియలయందు మీకు అవిధేయుడనైయున్నాను. కీడైన దానినే చేయుచు మేలైన దానిని చేయుటలో తప్పిపోతిని. ఇందునిమిత్తమై ఇప్పటికిని, నిత్యత్వమునకును, మీ శిక్షకు పాత్రుడను కానీ, నా పాపములను గూర్చి నిజముగా దుఃఖించుచు నా రక్షకుడైన యేసుక్రీస్తునందు నమ్మికయుంచుచు "ప్రభువా పాపినైన నన్ను కరుణించుము" అని ప్రార్థించుచున్నాను.

పాస్టరు : *(సంఘం వైపు)* మన పరలోకపు తండ్రియగు దేవుడు, మనయందు కనికరముంచి తన ఏక కుమారుని మన పాపములకు ప్రాయశ్చిత్త బలిగా అర్పించెను. కనుక క్రీస్తు సేవకునిగా పిలువబడిన నేను ఆయన ఇచ్చిన అధికారమును బట్టి మీ పాపములన్నియు తండ్రియొక్కయు కుమారునియొక్కయు † పరిశుద్ధాత్మ యొక్కయు నామమున క్షమించుచున్నాను.

సంఘం : ఆమేన్.

# బాప్తిస్మమాచరించుట

*(బాప్తిస్మపు పాత్ర దగ్గరకు వెళ్ళవలెను)*

## చిన్న పిల్లల కొరకు

పాష్టరు : *(సంఘం వైపు)* మన ప్రభువు యిచ్చిన ఆజ్ఞకు విధేయులై, ఆయన వాగ్దానమునందు నమ్మిక యుంచి, యీ బిడ్డను బాప్తిస్మమునకై మీరు తీసికొని వచ్చియున్నారు. "చిన్న పిల్లలను నా యొద్దకు రానియ్యుడి, దేవుని రాజ్యము ఈలాటి వారిదే" నని యేసు ప్రభువు చెప్పెను. బాప్తిస్మమునందు దేవుడు చిన్న పిల్లలకు క్షమాపణ నొందిన నూతన జీవితము, సంతోషము, సమాధానము, దయచేయుచున్నాడు. దేవుని వాక్య శక్తిచేత యీ కృపా జీవపు మేలు పాపములను కడిగివేయుచున్నది. మరణము నుండి సాతాను నుండి విడుదల కలుగజేసి నమ్మువారందరికి నిత్య రక్షణను ఇచ్చుచున్నది.

## పెద్దవారికి

పాష్టరు : *(సంఘం వైపు)* ................ అను నీవు క్రీస్తునందున్న నూతన జీవితము నీ సొంతమై యున్నదని నమ్ముటకు దేవుని వాక్య శక్తిచేత పరిశుద్ధాత్మునిచే నడిపింపబడితివి.

ఇప్పుడు పరిశుద్ధ బాప్తిస్మము నందు ప్రభుయేసు నీ రక్షణను గూర్చి నీకు నిర్ధారణ చేయుచున్నాడు.

నీ విశ్వాసమును నీవు బహిరంగముగ ఒప్పుకొనునట్లు ఈ క్రింది ప్రశ్నలకు జవాబిమ్ము.

నీవు పాపమునందు జన్మించితివి కనుక శాశ్వతముగ నశించి పోతివని నీవు నమ్ముచున్నావా?

వ్యక్తి : **అవును, నేను నమ్ముచున్నాను.**

పాష్టరు : త్రియేక దేవుడైన తండ్రి కుమార పరిశుద్ధాత్మను నీవు నమ్ముచున్నావా?

వ్యక్తి : **అవును, నేను నమ్ముచున్నాను.**

పాష్టరు : ఈ త్రిత్వ దేవుడు నీ రక్షణను సంకల్పించి ముగించి యున్నాడని నీవు నమ్ముచున్నావా?

వ్యక్తి : **అవును, నేను నమ్ముచున్నాను.**

పాష్టరు : ఈ పరిశుద్ధ బాప్తిస్మమునందు దేవుడు నీ పాపములకు క్షమాపణ దయచేసి యున్నాడని నమ్ముచున్నావా?

వ్యక్తి : **అవును, నేను నమ్ముచున్నాను.**

పాష్టరు : నీవు బాప్తిస్మము పొందగోరుచున్నావా?

వ్యక్తి : **అవును నేను పొందగోరుచున్నాను.**

పాష్టరు : క్రీస్తు యొక్క విమోచింపబడిన బిడ్డవనుటకు సూచనగా సిలువగుర్తును నీ † నుదిటి మీదను † హృదయం మీదను వేయుచున్నాను.

*(పాస్టరు నీటిని ఆ వ్యక్తిపై చల్లుచు లేక పోయుచు చెప్పవలెను)*

.................... అను నీకు తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున బాప్తిస్మమిచ్చుచున్నాను. సర్వశక్తిగల దేవుడైన తండ్రి కుమార పరిశుద్ధాత్మ నీ పాపమును క్షమించియున్నాడు. నీ బాప్తిస్మము ద్వారా నీవు తిరిగి జన్మించితివి. పరలోకమందలి తండ్రి యొక్క ప్రియ బిడ్డగా చేయబడి యున్నావు. బాప్తిస్మమందు నిలిచిన కృపలో నీ జీవిత కాలమంతయు నివసించునట్లు దేవుడు నిన్ను బలపరచునుగాక. నీకు సమాధానము కలుగును గాక.

పాష్టరు : క్రీస్తునందు నా సహోదరీ సహోదరులారా బాప్తిస్మము పొందిన ప్రతివారికిని ఆయన ప్రశస్త సత్యములను బోధింపవలెనని మన ప్రభువు ఆజ్ఞ యిచ్చెను. ........... **అను ఈయన / ఈమె దేవుని బిడ్డగ మరణ పర్యంతము జీవించుటకు మన మందరము ప్రత్యేకముగా తల్లి దండ్రులును, ఆత్మీయ** పెంపుదలకు బాధ్యులు. మీరును సాధ్యమైన రీతులుగ వీరికి సహాయపడవలెనని క్రైస్తవ ప్రేమను బట్టి మిమ్మును అడుగుచున్నాను. మీరు ఈ బాధ్యతను స్వీకరించుటకు అంగీకరించిన యెడల దేవుడు నన్ను బలపరచిన కొలది చేయుదునని మాట ఇయ్యుడి.

సంఘం : **అవును, దేవుడు మమ్మును బలపరచిన రీతిగ సహాయము చేయుదము.**

పాష్టరు : (అల్టరు వైపు) ప్రార్థింతము

కనికరము గల పరలోకపు తండ్రీ, బాప్తిస్మపు దీవెన ద్వారా మీరు దయచేయు పాప క్షమాపణ కొరకు, జీవము కొరకు, రక్షణ కొరకు మిమ్ము స్తుతించుచున్నాము. మా జీవిత కాలమంతయు బాప్తిస్మమును రక్షణ వస్త్రముగ పరిగణించగల శక్తిని మాకు దయచేయుము.

................ అను ఈయనను / ఈమెను మీ ప్రత్యేక కనికరముతో దర్శించుము. మీ యాత్మను ఈయనకు / ఈమెకు / వీరికి సమృద్ధిగా దయచేయుము. విశ్వాసము నందు పెరుగుటకును, పరిశుద్ధ జీవితము జీవించుటకును సహాయము చేయుము. ఇప్పుడు బాప్తిస్మము పొందినవారి యెడల మేము నెరవేర్చవలసిన బాధ్యత యిష్టపూర్వకముగా చేయుటకు నేర్పించుము. మేమందరము తుదకు మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా పరలోకపు మహిమానందములో ప్రవేశించునట్లు దయచేయుము.

సంఘం : ఆమేన్.

సామాన్య ఆరాధన 8వ పేజి నుండి కొనసాగును.

పరిశుద్ధ ప్రభు రాత్రి భోజన సంస్కార ఆరాధన 15వ పేజీ నుండి కొనసాగును.

## అత్యవసర బాప్తిస్మ సంస్కార క్రమము

*(అత్యవసర సందర్భములలో నీటిని చల్లుచు లేక పోయుచు)*

"తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామమున నీకు బాప్తిస్మము ఇచ్చుచున్నాను." అని చెప్పవలెను. కొంచెము వ్యవధి వున్న యెడల ప్రభువు ప్రార్థనగాని మరియొక ప్రార్థనగాని చెప్పవచ్చును.

# సామాన్య ఆరాధన క్రమము

*(ప్రారంభమున పరిశుద్ధాత్మను వేడుకొను కీర్తనగాని, అనుకూలమగు వేరొక కీర్తనగాని పాడుచు ఆఖరి చరణము పాడుచున్నపుడు సంఘం నిలువబడవలెను)*

పాస్టరు : *(ఆల్టరు వైపు)* తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున

సంఘం : **ఆమేన్.**

## పాపపు ఒప్పుకోలు

పాస్టరు : *(సంఘం వైపు)* ప్రభువునందు ప్రియులారా, యదార్థ హృదయముతో మన తండ్రియైన దేవుని సమీపించి ఆయన యెదుట మన పాపములను ఒప్పుకొని మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మనకు పాప క్షమాపణ దయ చేయుమని వేడుకొందము.

*(సంఘము నిలువబడి యుండవచ్చును, లేక మోకరింపవచ్చును. పాస్టరుతో కలిసి ఈ విధముగా చెప్పవలెను).*

అందరు : *(ఆల్టరు వైపు)* **కనికరముగల పరిశుద్ధుడవైన తండ్రీ, నేను స్వాభావికముగా పాపినని, నా తలంపులయందు, మాటలయందు, క్రియలయందు మీకు అవిధేయుడనై యున్నాను. కీడైన దానినే చేయుచు మేలైన దానిని చేయుటలో తప్పిపోతిని. ఇందు నిమిత్తమై ఇప్పటికిని, నిత్యత్వ మునకును, మీ శిక్షకు పాత్రుడను కానీ, నా పాపములను గూర్చి నిజముగా దుఃఖించుచు నా రక్షకుడైన యేసుక్రీస్తునందు నమ్మిక యుంచుచు "ప్రభువా పాపినైన నన్ను కరుణించుము" అని ప్రార్థించుచున్నాను.**

సంఘం : *(ఆల్టరు వైపు)* ప్రభువా, మమ్మును కనికరించుము.
క్రీస్తూ, మమ్మును కనికరించుము.
ప్రభువా, మమ్మును కనికరించుము.

పాస్టరు : (సంఘం వైపు) మన పరలోకపు తండ్రియగు దేవుడు, మనయందు కనికరముంచి తన ఏక కుమారుని మన పాపములకు ప్రాయశ్చిత్తబలిగా అర్పించెను. కనుక క్రీస్తు సేవకునిగా పిలువబడిన నేను అయన ఇచ్చిన అధికారమును బట్టి మీ పాపములన్నియు తండ్రియొక్కయు † కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున క్షమించుచున్నాను.

సంఘం : ఆమేన్.

(బాప్తిస్మ ఆరాధన తరువాత ప్రారంభము)

# ప్రార్థన స్తుతి

పాస్టరు : (సంఘం వైపు) పాపములు క్షమింపబడినవన్న సమాధానముతో మనము దేవుని స్తుతించెదము. దేవునికి మహిమ కలుగునుగాక.

సంఘం : కలుగునుగాక - దేవునికి మహిమ - కలుగును గాక = కలుగు నున్నతమైన - ఘన స్థలములందున - ఇలకు సమాధానం - నరుల కాయన దయ॥

1. ప్రభువైన దేవా - పరమరాజా - సర్వ పరిపాలా = పరిపూర్ణ శక్తిగల - పరమ జనక నిన్ను - మహిని స్తుతించుచు - మరి పొగడుచున్నాము॥
2. మహిమ పర్చుచు - ఆరాధించు - చున్నాము నిన్ను = మహిమాతి శయమును - మది దలంచియు నీకు - మహిని మాస్తుతి కృత - జ్ఞత నిచ్చు చున్నాము ॥
3. ఏక కుమారా - యేసు ప్రభువా - యెహోవా తనయా = లోక పాపము మోయు - ఏక దేవుని గొర్రె - పిల్ల మమ్మును కనిక-రించుము చల్లగ॥
4. లోక పాపములు - మోయుచుబోవు - యేసు రక్షకా = వాసిగ జనకుని - కుడి వైపున గూర్చుండి - యేసూ మా ప్రార్థనా - లించి కనికరించు ॥
5. పరిశుద్ధుడవు - ప్రభుడవు నీవు - ప్రభువైన క్రీస్తూ = పరిశుద్ధాత్మతో తండ్రి- యైన దేవుని యందు - పరిపూర్ణ మహిమతో -ప్రబలు చున్నావెపుడు ఆమేన్ ॥

పాస్టరు : (సంఘం వైపు) ప్రభువు మీతో నుండుగాక!

సంఘం : మీ ఆత్మతో నుండుగాక!

పాస్టరు : (సంఘం వైపు) ప్రార్థింతుము

(ఆల్టరువైపు తిరిగి ఆ దినము కొరకైన సంగ్రహ ప్రార్థన చేయవలెను).

సంఘం : ఆమేన్. (సంఘము కూర్చొన వచ్చును)

# దేవుని వాక్య పఠనము

## పాత నిబంధన పాఠ్యభాగము

(ఇచట ఆ దినము యొక్క పేరు చెప్పవలెను)

పాస్టరు : (సంఘం వైపు) ................ కు ఏర్పరచబడిన పాత నిబంధన పాఠ్యభాగము....... వ్రాసిన గ్రంథము.................... వ అధ్యాయము .......... వచనము నుండి .............., వచనము వరకు ఈలాగు వ్రాయబడియున్నది.

(చదివిన తరువాత)

పాస్టరు : (సంఘం వైపు) ఇంతటితో ఈ దినము కొరకైన పాత నిబంధన పాఠ్యభాగము ముగియుచున్నది.

(పాత నిబంధన వాక్యభాగము ముగియగానే పాడవలసినది)

సంఘం : **పరిశుద్ధుడవగుదేవా! పావన శక్తుడ దేవా! పావనా మర్త్య దేవా! మమ్మును కనికరించుము.**

## కీర్తన పాఠ్యభాగము

పాస్టరు : ఈ దినము కొరకైన కీర్తన ఉత్తర ప్రత్యుత్తరములుగా చదువుకొందము ............ కీర్తన............. వచనము నుండి ........... వచనము వరకు.

## పత్రిక పాఠ్యభాగము

(ఇచ్చట ఆ దినము యొక్క పేరు చెప్పవలెను)

పాస్టరు : (సంఘం వైపు) ............... కు ఏర్పరచబడిన పత్రిక పాఠ్యభాగము పరిశుద్ధుడైన .......... వ్రాసిన పత్రిక.......... వ అధ్యాయము.............. వ వచనము నుండి .......... వ వచనము వరకు ఈలాగు వ్రాయబడి యున్నది.

(చదివిన తరువాత)

పాస్టరు : ఇంతటితో ఈ దినము కొరకైన పత్రిక పాఠ్యభాగము ముగియుచున్నది.

సంఘం : **హల్లెలూయా, హల్లెలూయా, హల్లెలూయా.**

(ప్రభుని శ్రమ (లెంటు) కాలములో ఈ క్రింది వచనము పాడవలెను)

సంఘం : **నిందితుడై క్రీస్తు మరణమొందునంతగా శ్రమ నొందు నంతగా సిలువొందు నంతగా ఇంపొందుగా తగ్గించుకొనియే, నొనర వినయుడై.**

## సువార్త పాఠ్యభాగము

పాస్టరు : (సంఘం వైపు) ................కు ఏర్పర్చబడిన సువార్త వాక్యభాగము పరిశుద్ధుడైన ....... వ్రాసిన సువార్త ........... వ అధ్యాయము.......... వ వచనము నుండి ........ వచనము వరకు ఈలాగు వ్రాయబడి యున్నది.

*(అంతట సంఘం నిలువబడి ఈ క్రింది వచనము పాడవలెను)*

సంఘం : **ఓ ప్రభువా! నీకు మహిమ కలుగునుగాక.**

*(సువార్త వాక్యభాగము ప్రకటించి చదువుట ముగించిన తరువాత)*

పాస్టరు : ఇంతటితో ఈ దినము కొరకైన సువార్త పాఠ్యభాగము ముగియుచున్నది.

*(అంతట సంఘం ఈ క్రింది వచనము పాడవలెను)*

సంఘం : **ఓ క్రీస్తు! నీకు స్తోత్రము కలుగునుగాక.**

*(అందరు కలసి విశ్వాస ప్రమాణము చెప్పవలెను)*

## అపొస్తలుల విశ్వాస ప్రమాణము

అందరు : *(అల్టరు వైపు)* భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన ఏక కుమారుడును మన ప్రభువైన యేసు క్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మ వలన గర్భమున ధరింపబడి, కన్యయైన మరియకు పుట్టి పొంతి పిలాతు అధికారము క్రింద శ్రమపడి, సిలువ వేయబడి, చనిపోయి సమాధిచేయబడెననియు, [1]అదృశ్యలోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలో నుండి మూడవ దినమున తిరిగిలేచి, పరలోకమున కెక్కి, సర్వశక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతి వైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును, మృతులకును తీర్పు చేయుటకు అక్కడ నుండి వచ్చుననియు నమ్ముచున్నాను.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను, పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్య జీవమును ఉన్నవని నమ్ముచున్నాను. ఆమేన్.

(లేక)

---

*1. నరకము*

# నికేయ విశ్వాస ప్రమాణము

(ప్రభురాత్రి భోజనారాధన సమయమందు చెప్పవలెను)

అందరు : (అల్టరు వైపు) : భూమ్యాకాశములను దృశ్యా దృశ్యమగు సమస్తమును సృజించిన సర్వశక్తిగల తండ్రియైన ఏక దేవుని మనము నమ్ము చున్నాము.

ఆయన ఏక కుమారుడును, ఏక ప్రభువైన యేసు క్రీస్తును మనము నమ్ముచున్నాము. ఈయన నిత్యత్వము నుండి తండ్రి నుండి కలిగిన వాడును, దేవుని నుండి దేవుడును, వెలుగు నుండి వెలుగును, నిజమైన దేవుని నుండి నిజమైన దేవుడును, సృజింపబడక జన్మించిన వాడును, తండ్రితో సదా ఉన్నవాడునై యున్నాడు. ఈయన ద్వారా సమస్తమును కలుగజేయబడి యున్నది. ఈయన మానవులమగు మన కొరకును, మన రక్షణ కొరకును, పరలోకము నుండి దిగి కన్యయగు మరియ నుండి పరిశుద్ధాత్మ వలన శరీరధారియై పుట్టి, పరిపూర్ణ మనుష్యు డాయెననియు, పొంతి పిలాతు అధికారము క్రింద మన కొరకు సిలువ వేయబడి, శ్రమనొంది మరణించి సమాధి చేయబడెననియు, లేఖనముల ప్రకారము మూడవ దినమున తిరిగి లేచి, పరలోకమున కెక్కి, తండ్రి యొక్క కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును మృతులకును తీర్పు చేయుటకు తిరిగి మహిమతో అక్కడ నుండి వచ్చుననియు, ఆయన రాజ్యమునకు అంతము లేదనియు నమ్ముచున్నాము.

తండ్రి నుండియు, కుమారుని నుండియు బయలు వెడలుచు తండ్రితోను కుమారునితోను ఏకముగా ఆరాధింపబడుచు, మహిమ పరచబడుచు ప్రవక్తల ద్వారా మాట్లాడినవాడును, జీవమునకు దాతయు ప్రభువునగు పరిశుద్ధాత్ముని నమ్ముచున్నాము. మరియు పరిశుద్ధమైన సార్వత్రిక అపొస్తలుల యేక సంఘమును నమ్ముచున్నాము. పాప పరిహారమునకై ఒకే బాప్తిస్మమును ఒప్పుకొనుచున్నాము. మృతుల పునరుత్థానము కొరకును రాబోవు లోకములో జీవించు బ్రదుకు కొరకును నిరీక్షించుచున్నాము. ఆమేన్.

# కీర్తన

(సందేశమునకు సంబంధించినది)

(కీర్తన ఆఖరి చరణము పాడుచుండగా సంఘము నిలిచియుండవలెను)

(వాక్య సందేశమునకు ముందు సంఘము నిలువబడి యుండగా పాస్టరు ఈ క్రింది వాక్యము చెప్పవలెను)

పాస్టరు : (సంఘం వైపు) మన తండ్రియైన దేవుని నుండియు, ప్రభువైన యేసు క్రీస్తు నుండియు కృపా సమాధానములు మీకు కలుగును గాక.

(అందరు నిలువబడియుండగా పాస్టరు ప్రసంగ పాఠము చదువవలెను తరువాత అందరిని కూర్చొనమని చెప్పవలెను)

# వాక్య సందేశము

(వాక్య సందేశము ముగియగానే సంఘం నిలువబడి యుండగా)

పాస్టరు : (సంఘం వైపు) సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును గాక.

అందరు : (ఆల్టరు వైపు) దేవా! నా యందు - శుద్ధ హృదయము కలుగ జేయుము = నా అంతరంగములో - స్థిరమైన మనస్సు నూ - తనముగా పుట్టించుము॥

నీ సన్నిధానములో - నుండి నన్ను - త్రోసివేయకుము = నీ పరిశుద్ధాత్మను - నా యొద్ద నుండి తీసివేయకుము ॥

నీ రక్షణానంద-ము నాకు మరల పుట్టించుము = సమ్మతి గల మనస్సు కలుగజేసి - నన్ను దృఢపరచుము ॥

(సంఘం కూర్చొనవచ్చును)

# అర్పణలు

పాస్టరు : సంఘము కృతజ్ఞత కానుకలు సమర్పించును. (పాస్టరు వాటి కొరకై ప్రత్యేక ప్రార్థన చేయవలెను.)

సంఘ కానుకలు - (కానుకలు పట్టుచుండగా కీర్తన పాడవలెను. సంఘము కానుకలు పట్టిన పిమ్మట పాస్టరు వానినందుకొని వేదికవైపు తిరిగియుండగా సంఘము నిలిచి ఈ క్రింది చరణం పాడవలెను).

సంఘం : (అల్టరు వైపు) నీ కిచ్చు అర్పణలు - నీవే మాకిచ్చితివి = మా కున్న సకలాస్తుల్ (2) మా ప్రభువాయవి నీవెగదా - నీకిచ్చు అర్పణలు - నీవిపుడు గైకొనుమా.

పాస్టరు : (అల్టరు వైపు) సంఘ ప్రార్థన

(కానుకల కొరకును, రోగుల కొరకును, సంఘము, ప్రభుత్వము కొరకును మరియు ఇతర సందర్భముల కొరకును ప్రార్థించవలెను)

అందరు : (అల్టరు వైపు) ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక; నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక, మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. శోధనలోనికి తేక కీడు నుండి మమ్ములను తప్పించుము. రాజ్యము, శక్తి, మహిమయు నిరంతరము నీవియై యున్నవి. ఆమేన్.

(సంఘమును కూర్చొనమని చెప్పవలెను)

## సంఘమునకు సంబంధించిన ప్రకటనలు

(ప్రభురాత్రి భోజన సంస్కారము ఉన్నప్పుడు 17వ పేజీలోని ఆరాధన కొనసాగించవలెను.)

(ప్రభురాత్రి భోజన సంస్కారము లేనప్పుడు 22వ పేజీలోని ఆరాధన కొనసాగించవలెను.)

# పరిశుద్ధ ప్రభురాత్రి భోజన సంస్కార ఆరాధన

*(సంఘం ప్రభురాత్రి భోజనమునకు సంబంధించిన కీర్తన పాడవలెను)*
కీర్తన ఆఖరి చరణము పాడుచుండగా సంఘము నిలువబడి యుండవలెను.

పాస్టరు : *(సంఘం వైపు)* ప్రభువు మీతో నుండునుగాక!

సంఘం : **మీ ఆత్మతో నుండునుగాక.**

పాస్టరు : *(సంఘం వైపు)* మీ హృదయములను పైకెత్తుడి.

సంఘం : **ప్రభువు తట్టు మేము వాటిని ఎత్తుచున్నాము.**

పాస్టరు : *(సంఘం వైపు)* మన దేవుడైన ప్రభువునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లింతుము.

సంఘం : **అలాగు చేయుట తగినదియు, సరియైనదియునై యున్నది.**

పాస్టరు : *(అల్టరు వైపు)* ఓ ప్రభువా, పరిశుద్ధుడవైన తండ్రీ! సర్వశక్తిగల దేవా! మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా అన్ని వేళల అన్ని స్థలములందు మీకు స్తుతి వందనములు ఆచరించుట మాకు తగినదియు సరియైనదియునై యున్నది...

*(ఇచ్చట ఆయా కాలముల కొరకు ఏర్పరచబడిన ప్రారంభ వాక్యములను చెప్పవలెను)*

## ప్రారంభ వాక్యములు

### అడ్వెంటు

...బాప్తిస్మము ఇచ్చు యోహాను ప్రజలను పశ్చాత్తాపము పొందవలెననియు, యేసు క్రీస్తు లోక పాపములు మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల అనియు సూచించుచు ఆయన మార్గమును సిద్ధపరచెను కనుక....

### క్రిస్మస్

...ఆయన పుట్టుక ద్వారా ఆయన పుట్టుకలో గల ఆశ్చర్య మర్మముద్వారా మా నేత్రములను మీ కృపా మహిమకై తెరచి, మా హృదయములను నూతన పరచి, మీ ప్రేమను మా హృదయములలో ధారాళముగా ఉంచి యున్నారు కనుక...

## ఎపిఫానియా

... మీ ఏకైక కుమారుడు కృపా సత్య సంపూర్ణుడుగాను, మానవునిగాను ఆయన మా మధ్య మానవునిగా జీవించి, పరిపూర్ణమైన కృప, సత్యము కలిగిన మీ ఏక కుమారునిగా తన మహిమను వ్యక్తపరచి యున్నారు కనుక...

## లెంటు

...సిలువ మ్రానుమీద ఆయన మరణము ద్వారా రక్షణ దానమును ప్రజలందరికి తెచ్చితివి. కనుక ఎవరైతే మమ్మును చెట్టు ద్వారా జయించెనో ఆ మ్రాను మీదనే తిరిగి వానిని జయించి యున్నారు కనుక...

## ఈస్టరు, ఆరోహణము

...నిజమైన పస్కా పశువుగా మీ కుమారుడు ఆయన బలి ద్వారా లోకపాపములు క్షమించిన ఆయన పునరుత్థానమునకై మిమ్ములను ప్రత్యేకముగా స్తుతించుచున్నాము కనుక...

## పెంతెకొస్తు

...ఆయన ఈ దినమున తన వాగ్దానము నెరవేర్చుకొని పరిశుద్ధాత్ముని సంఘముపై క్రుమ్మరించి లోకమునకు సువార్తను ప్రకటించుటకు ఆయన సంఘమును శక్తివంతముగా చేసెను కనుక...

## పరిశుద్ధ త్రిత్వము

....మీరును, మీ కుమారుడును, పరిశుద్ధాత్మయును ఏక దేవుడును ఏక ప్రభువై యున్నారనియు, మీరు మా సృష్టికర్త, విమోచకుడు, పరిశుద్ధ పరచువాడునై యున్నారని, మీ యెదుట ఒప్పుకొనుచున్నాము కనుక....

## పెంతెకొస్తు తరువాతి ఆదివారము

.... తాను తన మహిమతో తిరిగి వచ్చు పర్యంతము తన మందను కాయుటకు ఎక్కడ యిద్దరు ముగ్గురు తన నామము నందు కూడి యుందురో అక్కడ నేనుందునని చెప్పెను కనుక...

## అంత్యకాలము

...ఆయన తిరిగి రాజుగా సమస్త జనులకు తీర్పు తీర్చి తన సొంత మహిమలోనికి వారిని అంగీకరించు వరకు ఆయన తన సంఘమును యుగ సమాప్తివరకు భద్రపరచుచున్నారు కనుక....

## చిన్న పండుగలు

...ఆయన దీవెనలచే గతకాలమందు ఆయన పరిశుద్ధులు మహిమ గల నిరీక్షణను, నిర్ధారణను ఇచ్చియున్నారు. వారి విశ్వాసపు మాదిరినే అనుసరించి మనముందు ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తునట్లు, వాడబారని మహిమాయుక్తమైన కిరీటము పొందుదము కనుక....

పాస్టరు : *(అల్టరు వైపు)*... పరలోక సైన్య సమూహముతోను భూమిమీద ఉన్న పరిశుద్ధులందరితోను మీ పరిశుద్ధ నామము స్తుతించుచు వారి మహిమా గీతములందు ఇట్లు పాలుపొందుచున్నాము.

సంఘం : **పరిశుద్ధుడా! పరిశుద్ధుడా!! పరిశుద్ధుడా!!! సైన్యముల ప్రభువగు దేవా! ఆకాశము భూమియు నీ మహిమతో నిండియున్నవి, సర్వోన్నతమైన వానిలో హోసన్నా, ప్రభువు పేరిట వచ్చువాడు స్తుతింపబడుగాక సర్వోన్నతమైన వానిలో హోసన్నా.**

*(ఇచ్చుట రొట్టెయున్న పాత్రను తన చేతితో పట్టుకొనవలయును)*

పాస్టరు : *(అల్టరు వైపు)* మన ప్రభువైన క్రీస్తు తాను అప్పగింపబడిన రాత్రి రొట్టెను తీసికొని స్తోత్రము చేసి దానిని విరిచి తన శిష్యులకిచ్చి, "ఇది తీసికొని తినుడి. ఇది మీ కొరకియ్యబడిన నా శరీరము నన్ను జ్ఞాపకము చేసుకొనుటకై దీనిని చేయుడి" అని చెప్పెను.

*(ఇచ్చుట పులిసిన ద్రాక్షరసము యున్న పాత్రను తన చేతితో పట్టుకొనవలయును)*

పాస్టరు : *(అల్టరు వైపు)* ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను తీసికొని స్తోత్రము చేసి వారికి దానినిచ్చి "దీనిలోనిది మీరందరు త్రాగుడి. ఇది మీ కొరకు మీ పాప క్షమాపణ కొరకును చిందించబడిన క్రొత్త నిబంధన వలననైన నా రక్తము. దీనిలోనిది మీరు త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసుకొనుటకై దీనిని చేయుడి," అని చెప్పెను.

పాస్టరు : *(సంఘం వైపు)* ప్రభువు సమాధానము ఎల్లప్పుడు మీతో నుండునుగాక.

సంఘం : **ఆమేన్.**

సంఘం : లోక పాపములు మోసుకొని పోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ మమ్మును కనికరింపుము ॥

లోక పాపములు మోసుకొని పోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ మమ్మును కనికరింపుము ॥

లోక పాపములు మోసుకొని పోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ నీ సమాధానము మాకు దయచేయుము ఆమేన్.

## రొట్టె పులిసిన ద్రాక్షారసము పంచుట

*(ఈ సమయములో కీర్తన నెమ్మదిగా పాడవచ్చును)*

*(సంఘము కూర్చొనవలెను. పాస్టరు రొట్టెనిచ్చునపుడు ఇట్లు చెప్పవలెను)*

పాస్టరు : తీసుకొని తినుము, ఇది నీ కొరకు విరువబడిన మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క నిజమైన శరీరము.

*(పాస్టరు పులిసిన ద్రాక్షారసము ఇచ్చునపుడు ఇట్లు చెప్పవలెను)*

పాస్టరు : తీసుకొని త్రాగుము ఇది నీ పాప క్షమాపణ కొరకై చిందింపబడిన మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క నిబంధన రక్తము.

*(రొట్టె, పులిసిన ద్రాక్షరసము ఇచ్చిన పిమ్మట పాస్టరు ఇట్లు చెప్పవలెను.)*

పాస్టరు : *(సంఘం వైపు)* మన ప్రభువైన యేసు క్రీస్తు శరీరమును, ఆయన వెలలేని రక్తమును మిమ్మును నిజమైన విశ్వాసమందు స్థిరపరచి నిత్య జీవము కలుగుటకై సంరక్షించునుగాక! ఆమేన్. సమాధానముతో వెళ్ళుడి.

## కృతజ్ఞతా స్తుతి

*(సుమెయోను గీతము, సంఘము నిలువబడవలెను)*

1. నీ సమాధానము -దాసుని కిప్పుడు-నాథా దేవా = ఇచ్చి- నీ మాట చొప్పున - పోనిచ్చుచున్నావు నాథా దేవా ॥
2. అన్యులకు నిన్ను - బయలు పరచెడి - వెలుగుగాను = నీకు - అణుగు ప్రజలైన ఇశ్రాయేల్ వారికి మహిమగాను ॥
3. నరులకై నీవు యేర్పరచిన రక్షణన్ - నాథా దేవా = ఇదిగో-నా కండ్లు చూచి యానందించు చున్నవి - నాథా దేవా॥
4. తండ్రికి, సుతునికి - పరిశుద్ధాత్మకును - కలుగుగాక=మహిమ- తరగక సదాకాలం - యుగయుగములకును కలుగునామేన్.

పాస్టరు : *(సంఘం వైపు)* రండి ప్రభువునకు స్తోత్రము చెల్లించుదము, ఆయన మహోత్తముడు.

సంఘం : **ఆయన కృప నిరంతరముండును గాక.**

పాస్టరు : *(అల్టరు వైపు)* సర్వశక్తిగల దేవా, శ్రేయస్కరమైన నీ పరిశుద్ధ రాత్రి భోజనము ద్వారా మమ్మును సేద తీర్చినందుకు మీకు వందనములు. దీని ద్వారా మీ యందలి విశ్వాసము నందు బలపరచి, ఒకరి యెడల ఒకరికి ఉండవలసిన మా ప్రేమను వృద్ధి చేయుమని మీతోను, పరిశుద్ధాత్మతోను ఏక దేవునిగా ఇప్పుడును నిరంతరమును జీవించుచు పరిపాలించుచు నుండు మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము.

(లేక)

పాస్టరు : *(అల్టరువైపు)* మా తండ్రియైన దేవా, సమస్త మేలులకు ఆధారభూతుడా! నీ దయా ప్రేమచే నీ కుమారుని మానవ శరీరము ధరించుటకు పంపించి యున్నారు. ఈ ప్రభు రాత్రి భోజన సంస్కారమునందు ఆయన ద్వారా పాప క్షమాపణయు, సమాధానమును మాకు ఇచ్చి యున్నందుకు మీకు వందనములు. మీరు మమ్ములను విడనాడరనియు మేము దినదినము మనస్ఫూర్తిగా మిమ్మును సేవించునట్లు దయచేయుమని మీతోను, పరిశుద్ధాత్మతోను, ఏక దేవునిగా ఇప్పుడును నిరంతరమును జీవించుచు పరిపాలించుచు నుండు మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము.

సంఘం : **ఆమేన్.**

## దీవెన

పాస్టరు : *(సంఘం వైపు)* ప్రభువు నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడును గాక.
ప్రభువు నీకు తన సన్నిధిని ప్రకాశింప జేసి నిన్ను కరుణించును గాక.
ప్రభువు నీ మీద తన సన్నిధి కాంతి నుదయింపజేసి † నీకు సమాధానము దయచేయును గాక.

సంఘం : **ఆమేన్, ఆమేన్, ఆమేన్.**

# ముగింపు పాట

సంఘం : పంపుము దేవా దీవెనలతో - పంపుము దేవా - పంపుము దయచేత - పతిత పావననామ పెంపుగ నీ సేవ - ప్రియమొప్పనొనరింప ॥పంపుము॥

ఆమేన్.

(లేక)

మేళ్ళన్నియిచ్చు దేవునిన్ - స్తుతించు సర్వసృష్టియున్
స్తుతించు మోక్ష సైన్యముల్ - పితృ పుత్ర శుద్ధాత్మలన్
ఆమేన్.

# ప్రభురాత్రి భోజనము లేనప్పుడు ఆరాధన ఇట్లు ముగియును

*(సంఘము కూర్చుని యుండును)*

## కీర్తన

*(ఆఖరి చరణము పాడుచుండగా సంఘము నిలిచియుండును)*

పాస్టరు : *(ఆల్టరు వైపు)* శుభకరమైన దేవా, మేము నేర్చుకొనుటకు పరిశుద్ధ గ్రంథమును మీరు మాకు ఇచ్చియున్నారు. మేము దానిని విని, పఠించి, నేర్చుకొని, మా హృదయమునందు భద్రపరచుకొని, బలపడి, ఆదరణ నొందు నట్లుగా చేయుము. మేము ఈ పరిశుద్ధ వాక్యము ద్వారా మీ శుభ నిరీక్షణను, నిత్య జీవమును హత్తుకొనునట్లుగా దయచేయుమని మీతోను, పరిశుద్ధాత్మతోను ఏక దేవునిగా ఇప్పుడును నిరంతరమును జీవించుచు పరిపాలించుచునుండు మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము.

(లేక)

పాస్టరు : *(ఆల్టరు వైపు)* సర్వశక్తిగల దేవా నీ సంఘమునకు పరిశుద్ధాత్మని, పై నుండి వచ్చు జ్ఞానమును అనుగ్రహించుము. క్రీస్తు పరిశుద్ధ జనులైన వారికి నీ వాక్యమును స్వేచ్ఛగా ప్రకటించుటలో గల ఆటంకములన్నియు తొలగించి తద్వారా వీరిని బలపరచుము. మేము జీవించి యున్నంతకాలము మీ

నామమును ఒప్పుకొనుచు, మీ విశ్వాసమునందు నిలకడగా వుండి, మేము నిన్ను సేవించునట్లు అనుగ్రహించుమని మీతోను, పరిశుద్ధాత్మతోను, ఏక దేవునిగా ఇప్పుడును నిరంతరమును జీవించుచు పరిపాలించుచునుండు మా ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము.

సంఘం : **ఆమేన్.**

పాస్టరు : *(సంఘం వైపు)* ప్రభువు నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడును గాక. ప్రభువు నీకు తన సన్నిధిని ప్రకాశింపజేసి నిన్ను కరుణించుగాక. ప్రభువు నీ మీద తన సన్నిధికాంతి నుదయింపజేసి ✝ నీకు సమాధానము దయ చేయును గాక.

సంఘం : **ఆమేన్, ఆమేన్, ఆమేన్.**

## ముగింపు పాట

సంఘం : పంపుము దేవా దీవెనలతో - పంపుము దేవా - పంపుము దయచేత - పతిత పావననామ పెంపుగ నీ సేవ - ప్రియమొప్పనొనరింప ॥పంపుము॥

**ఆమేన్.**

(లేక)

**మేళ్ళన్నియిచ్చు దేవునిన్ - స్తుతించు సర్వసృష్టియున్**
**స్తుతించు మోక్ష సైన్యముల్ - పితృ పుత్ర శుద్ధాత్మలన్**
**ఆమేన్.**

# లూథరు చిన్న ప్రశ్నోత్తరి

## పెద్దలు తమ కుటుంబములలో నేర్పవలసిన సులభ క్రమము

## పది ఆజ్ఞలు

### 1 వ ఆజ్ఞ

**నీ దేవుడనైన యెహోవాను నేనే, నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు.**

*దీనికి అర్థమేమి?*

మనము సమస్తమైన వానికంటె దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి నమ్మి యుండవలెను.

### 2 వ ఆజ్ఞ

**నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా ఉపయోగించకూడదు.**

*దీనికి అర్థమేమి?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, ఆయన పేరట శపించకయు, ఒట్టు పెట్టుకొనకయు, మంత్రతంత్రములు చేయకయు, అబద్ధమాడకయు, వంచన చేయకయు, సకల శ్రమలయందు ఆయనను పేరుపెట్టి పిలిచి, ప్రార్థించి, స్తుతించి, కృతజ్ఞత నపరచ వలెను.

### 3 వ ఆజ్ఞ

**విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము.**

*దీనికి అర్థమేమి?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, సువార్త ప్రసంగమును గాని ఆయన వాక్యమును గాని తిరస్కరింపక, పరిశుద్ధముగా నెంచి సంతోషముతో నేర్చుకొనవలెను.

### 4 వ ఆజ్ఞ

**నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగినట్లు నీ తండ్రిని, నీ తల్లిని సన్మానించుము.**

*దీనికి అర్థమేమి ?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన తల్లి దండ్రులను, అధికారులను తిరస్కరింపకయు, వారికి కోపము పుట్టింపకయు, వారిని ఘనముగా నెంచి, సేవించి, వారికి లోబడి, వారి యెడల ప్రేమను, మర్యాదను చూపించవలెను.

## 5 వ ఆజ్ఞ

## నరహత్య చేయకూడదు

*దీనికి అర్థమేమి ?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని శరీరమునకు హానినైనను, ఆపదనైనను కలుగజేయక, సమస్త శరీర శ్రమలయందు వానికి సహాయమును, ఉపకారమును చేయవలెను.

## 6 వ ఆజ్ఞ

## వ్యభిచరింపకూడదు

*దీనికి అర్థమేమి ?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మాటలయందును, క్రియల యందును, చిత్తశుద్ధియు, శరీరశుద్ధియు గలవారమై నడచుకొనవలెను. మరియు భార్యా భర్త లొకరినొకరు ప్రేమించి గౌరవించుకొనవలెను.

## 7 వ ఆజ్ఞ

## దొంగిలకూడదు

*దీనికి అర్థమేమి ?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని సొమ్మునైనను, సొత్తునైనను దొంగిలింపకయు, మోసమైన సరకులచేతను, వర్తకముచేతను వానిని మన వశము చేసికొనకయు, వాని ఆస్థిని, జీవనోపాధిని, అభివృద్ధి పొందించి కాపాడుటలో వానికి సహాయము చేయవలెను.

## 8 వ ఆజ్ఞ

## నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు

*దీనికి అర్థమేమి ?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువానికి విరోధముగా అబద్ధమాడకయు, ద్రోహము చేయకయు, కొండెములు చెప్పకయు, వానికి అపకీర్తి సంభవింప చేయకయు, అతని పక్షముగా మాటలాడి అతనిని గూర్చి మంచి మాటలు పలికి అతని ప్రవర్తనను గూర్చి ప్రేమగల భావము కలిగియుండవలెను.

## 9 వ ఆజ్ఞ

## నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు

*దీనికి అర్థమేమి ?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని యింటిని, స్వాస్థ్యమును తంత్రోపాయముచేత సంపాదించుటకును, అన్యాయమును న్యాయమనిపించి వాని నాక్రమించుటకును కోరక, అవి అతని స్వాధీనములో నుండుటకు మనమతనికి అనుకూలముగా నుండి, తగిన సహాయము చేయవలెను.

## 10 వ ఆజ్ఞ

**నీ పొరుగువాని భార్యనైనను, అతని పనివారినైనను, అతని పశువులనైనను, నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింప కూడదు.**

*దీనికి అర్థమేమి ?*

మనము దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి, మన పొరుగువాని భార్యను లాలించి వశపరచుకొనకయు, పనివారిని బలాత్కారముగా తొలగింపకయు, పశువులను అక్రమముగా తోలుకొనిపోకయు, వారును అవియు అతని యొద్ద నుండి చేయవలసినదంతయు చేయునట్లు మనము ప్రయత్నము చేయవలెను.

ఈ ఆజ్ఞలన్నింటిని గూర్చి దేవుడు తెలియజెప్పినదేమి?

**నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను. నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యితరముల వరకు కరుణించువాడనై యున్నాను.**

*దీనికి అర్థమేమి ?*

దేవుడు ఈ ఆజ్ఞలు మీరువారినందరిని శిక్షించెదనని బెదరించుచున్నాడు. గనుక మన మాయన కోపమునకు భయపడి, ఆయన ఆజ్ఞలకు విరోధముగా ప్రవర్తింపక యుండవలెను. గాని ఈ ఆజ్ఞలను గైకొనువారందరికి కృపను సకలాశీర్వాదములను దయచేసెదనని వాగ్దానము చేయుచున్నాడు గనుక మన మాయనను ప్రేమించి ఆయనయందు నమ్మకముంచి ఆయన ఆజ్ఞలను సంతోషముతో గైకొనవలెను.

# అపొస్తలుల విశ్వాస ప్రమాణము

1 వ అంశము

సృష్టిని గూర్చినది

**భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.**

*దీనికి అర్థమేమి ?*

దేవుడు నన్నును, సమస్త జీవరాశులను కలుగజేసి, నాకు శరీరాత్మలను, కన్నులను, చెవులను, మొదలైన సకలావయములను, బుద్ధిని, సమస్త ఇంద్రియములను దయచేసి వానిని కాపాడుచున్నాడని నమ్ముచున్నాను. ఇంతేగాక జీవమునకు కావలసినదంతయు, అనగా వస్త్రములను, అన్నపానాదులను, ఇల్లు - ఆవరణమును, భార్య - పిల్లలను, పొలము, పశువులను మొదలైన సమస్త వస్తువులను ఆయన నాకు దయచేసి అనుదినము నా అక్కరలను తీర్చుచు, సకలాపాయములనుండి నన్ను తప్పించి, కీడులన్నిటి నుండి నన్ను కాపాడి రక్షించుచున్నాడని నమ్ముచున్నాను. ఆయన యివి యావత్తు నా పుణ్యమును బట్టియు, నా యోగ్యతను బట్టియు గాక తండ్రి భావముగల దైవ ప్రేమవలనను, కృప వలనను, దయచేయుచున్నాడు. కాబట్టి నేను యీ సమస్తమును గూర్చి ఆయనకు కృతజ్ఞత నగపరచి, ఆయనను స్తుతించి, సేవించి, ఆయనకు లోబడుటకు బద్ధుడనై యున్నానని నమ్ముచున్నాను. ఇది వాస్తవమే.

2 వ అంశము

విమోచనమును గూర్చినది

**ఆయన ఏక కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మ వలన గర్భమున ధరింపబడి, కన్యయైన మరియకు పుట్టి, పొంతి పిలాతు అధికారము క్రింద శ్రమపడి, సిలువ వేయబడి, చనిపోయి, సమాధి చేయ బడెననియు, అదృశ్యలోకము[1]లోనికి దిగెననియు, చనిపోయిన వారిలో నుండి మూడవ దినమున తిరిగి లేచి, పరలోకమునకెక్కి, సర్వశక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును, మృతులకును తీర్పు చేయుటకు అక్కడనుండి వచ్చుననియు నమ్ముచున్నాను.**

*1 నరకము*

దీనికి అర్థమేమి ?

తండ్రి నుండి అనాదియందు పుట్టిన నిజమైన దేవుడును, మరియ అను కన్య నుండి పుట్టిన నిజమైన మనుష్యుడైన యేసుక్రీస్తు నా ప్రభువైయున్నాడని నమ్ముచున్నాను. తప్పిపోయి శిక్షకు విధింపబడిన మనుష్యుడనైన నన్ను ఈయన వెండి, బంగారముల చేతగాక, వెలలేని తన పరిశుద్ధ రక్తము చేతను, తాను పొందిన నిరపరాధ శ్రమ మరణముల చేతను, సమస్త పాపముల నుండియు, మరణము నుండియు, సాతాను అధికారము నుండియు విమోచించి, రక్షించి నన్ను సంపాదించుకొనెను. మరియు ఆయన మరణము నుండి లేచి నిరంతరము జీవించుచు పరిపాలించుటనుబట్టి, నేనును ఆయన వాడనై ఆయన రాజ్యములో ఆయనతో జీవించుచు, నిత్యమైన నీతిని, నిర్దోషత్వమును, మోక్షానందమును కలిగిన వాడనై ఆయనను సేవించుటకు ఆయన యిదంతయు చేసెనని నమ్ముచున్నాను. ఇది వాస్తవమే.

3 వ అంశము

పరిశుద్ధపరచుటను గూర్చినది

**పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను, పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్య జీవమును ఉన్నవని నమ్ముచున్నాను. ఆమేన్.**

దీనికి అర్థమేమి ?

నేను నా స్వబుద్ధివలననైనను, స్వశక్తివలననైనను, నా ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచి ఆయన యొద్దకు చేరనేలేనుగాని, పరిశుద్ధాత్మ సువార్త వలన నన్ను పిలిచి, తన వరముల వలన నన్ను వెలిగించి, నిజమైన విశ్వాసమునందు నన్ను పరిశుద్ధపరచి, కాపాడుచున్నాడని నమ్ముచున్నాను. ఈలాగుననే యీయన భూమి మీదనున్న సమస్త క్రైస్తవ సంఘమును పిలిచి, తన చెంతచేర్చి, వెలిగించి, పరిశుద్ధపరచి, నిజమైన ఏక విశ్వాసమునందు యేసుక్రీస్తు నొద్ద కాపాడుచున్నాడు. యీయన ఈ సంఘములో నా యొక్కయు, విశ్వాసులందరి యొక్కయు సమస్త పాపములను అనుదినము సంపూర్ణముగా మన్నించుచు అంత్యదినమునందు నన్నును, చనిపోయినవారినందరిని లేపి, నాకును క్రీస్తునందు విశ్వాసముంచు వారందరకును నిత్య జీవము దయచేయునని నమ్ముచున్నాను. ఇది వాస్తవమే.

# ప్రభువు ప్రార్థన

**పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక; నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక, మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము. శోధనలోనికి తేక కీడు నుండి మమ్మును తప్పించుము. రాజ్యము, శక్తి, మహిమయు నిరంతరము నీవై యున్నవి. ఆమేన్.**

సంబోధన

## పరలోకమందున్న మా తండ్రీ,

*దీనికి అర్థమేమి ?*

ఈ మాటల ద్వారా దేవుడు ఆయనే మనకు నిజమైన తండ్రి అనియు, మనమాయనకు నిజమైన పిల్లలమనియు నమ్మవలెనని, ప్రియులైన పిల్లలు తమ ప్రియమైన తండ్రిని అడుగునట్లు మనమాయనను సంతోషముతోను, పూర్ణమైన నమ్మకముతోను ప్రార్థించ వలెనని ప్రేమతో మనలను ఆహ్వానించుచున్నాడు.

1 వ మనవి

## నీ నామము పరిశుద్ధ పరచబడుగాక;

*దీనికి అర్థమేమి ?*

దేవుని నామము సహజముగ నిత్యము పరిశుద్ధమై యున్నది. అయినను అది మనలోకూడ పరిశుద్ధ పరచబడునట్లు ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

### దేవుని నామము ఏలాగు పరిశుద్ధ పరచబడును?

దేవుని వాక్యమెట్టి కల్పన లేకుండ శుద్ధముగా బోధింపబడుట వలనను, మనము దేవుని పిల్లలముగా దాని ప్రకారము పరిశుద్ధముగా ప్రవర్తించుటవలనను, ఆయన నామము పరిశుద్ధ పరచబడును. పరలోకమందున్న ప్రియమైన తండ్రీ, ఈలాగు చేయుటకు మాకు సహాయము చేయుము.

అయినను దేవుని వాక్యప్రకారము బోధింపకయు, నడుచుకొనకయు నుండువాడు మన మధ్య దేవుని నామమును పరిశుద్ధ పరచక దూషించువాడగుచున్నాడు. పరలోకమందున్న మా తండ్రీ, మేము ఈలాగు చేయకుండ మమ్మును కాపాడుము.

2 వ మనవి

## నీ రాజ్యము వచ్చుగాక;

*దీనికి అర్థమేమి?*

మనము ప్రార్థించనప్పటికి దేవుని రాజ్యము నిశ్చయముగా దానంతట అదే వచ్చును. అయినను అది మన యొద్దకు, అనేకుల యొద్దకు వచ్చునట్లు ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

**దేవుని రాజ్యము ఏలాగు వచ్చును?**

మన పరలోకపు తండ్రి పరిశుద్ధాత్ముని నియ్యగా, ఆయన కృప వలన ఆయన పరిశుద్ధ నామమును మనము నమ్మునట్లును, ఇప్పుడు భూమిమీద, తరువాత నిత్యము పరలోకమునందు పరిశుద్ధ జీవితము జీవించునట్లుండగా దేవుని రాజ్యము మనకు వచ్చును.

3 వ మనవి

## నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక;

*దీనికి అర్థమేమి ?*

దేవుని కృపగల చిత్తము నిశ్చయముగా మన ప్రార్థన లేకయే నెరవేరును. అయినను, అది మన మధ్యకూడ నెరవేరవలెనని ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

దేవుని చిత్తము ఏలాగు నెరవేరును?

దేవుని నామమును మనము పరిశుద్ధముగా నుంచుటకును, ఆయన రాజ్యము వచ్చుటకును ఆటంకపరచు సాతాను సంకల్పమును, లోకమును, పాపపు శరీరము, వీటి ప్రతి దుష్టాలోచనను దేవుడు ఛేదించి, ఓడించినపుడు ఆయన చిత్తము నెరవేరును. మరియు మనము జీవించునంత కాలము ఆయనయందు విశ్వాసములోను, వాక్యములోను మనలను దృఢపరచి, బలపరచినపుడు దేవుని చిత్తము నెరవేరును. ఇదే ఆయన కృపగల చిత్తము.

4వ మనవి

## మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము

*దీనికి అర్థమేమి?*

దేవుడు నిశ్చయముగా మన ప్రార్థన లేకయే సకల దుర్మార్గులకు కూడా అనుదినాహారము దయచేయుచున్నాడు. అయినను, దీనిని గ్రహించులాగున ఆయన మనలను నడిపించవలెననియు, కృతజ్ఞతాస్తుతులతో మనము అనుదినాహారము పొందవలెననియు ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

అనుదినాహారము అనగా నేమి?

మన జీవమునకు కావలసినవన్నియు అనగా, అన్నపానాదులు, వస్త్రాభరణములు, ఇల్లు ఆవరణము, పొలము, పశువులు, సొమ్ము సొత్తు, దైవభక్తిగల కుటుంబము, మంచి పనివారు, భక్తిగలనమ్మకమైన మంచి అధికారులు, మంచి ప్రభుత్వము, మంచి వాతావరణము, శాంతి సమాధానము, ఆరోగ్యము, శిక్షణ, ఘనత, మంచి స్నేహితులు, నమ్మకమైన పొరుగువారు మొదలైనవన్నియు అనుదినాహారమనబడును.

5 వ మనవి

**మా యెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా అపరాధములను క్షమించుము.**

*దీనికి అర్థమేమి?*

మనము దేవుని వేడుకొని దేనినైనను పొందుటకు పాత్రులము కాము. దానికి తగిన క్రియలు చేసినవారము కాము. మరియు, మనము అనుదినము విస్తారముగా పాపముచేసి శిక్షను మాత్రమే పొందవలసి యున్నాము గనుక, పరలోకమందున్న తండ్రి మన పాపములను చూచియు, వాటిని బట్టి ఈ మనవులు కొట్టివేయక, ఆయన తన కృప వలననే యిదంతయు మనకు దయచేయవలయునని ఈ మనవిలో వేడుకొనుచున్నాము. ఆలాగుననే మనము కూడ మనకు విరోధముగా పాపము చేయువారిని పూర్ణ మనస్సుతో మన్నించి, సంతోషముతో వారికి మేలు చేయుటకు ఇష్టపడి యున్నామని ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

6 వ మనవి

**శోధనలోనికి తేక...**

*దీనికి అర్థమేమి?*

దేవుడు నిశ్చయముగా ఎవరిని పాపమునకు ప్రేరేపింపడు గాని సాతాను లోకము మరియు మన పాపపు శరీరమనునవి అవిశ్వాసము నిరాశ గొప్ప దోషములకును దుర్మార్గములకును లోబరచి మోసపుచ్చకుండునట్లును, వాటి వలన మనము ప్రేరేపింపబడినప్పటికిని మనము వాటిని జయించి అంతము వరకు నిలుచునట్లు దేవుడు మనలను తప్పించి కాపాడవలెనని యీ మనవిలో వేడుకొనుచున్నాము.

7 వ మనవి

## కీడు నుండి మమ్మును తప్పించుము.

*దీనికి అర్థమేమి ?*

శరీరమునకు ఆత్మకు ఆస్తికి ఘనతకు కలుగు కీడులన్నింటినుండి మనలను విడిపించి, తుదకు మన అవసాన కాలము వచ్చునపుడు మంచి మరణమును దయచేసి ఈ కష్ట లోకము నుండి పరలోకములో తనయొద్దకు కృపతో చేర్చుకొనవలెనని ఈ మనవిలో మన పరలోకపు తండ్రిని వేడుకొనుచున్నాము.

ప్రభువు ప్రార్థన ముగింపు

## రాజ్యము, శక్తి, మహిమయు నిరంతరము నీవై యున్నవి. ఆమేన్.

*దీనికి అర్థమేమి?*

మనమీలాగు ప్రార్థింపవలెనని ఆయనే మనకాజ్ఞాపించి మన ప్రార్థన విని దయచేసెదనని వాగ్దానము చేసెను. గనుక ఈ మనవులు పరలోకమందున్న మన తండ్రికి అనుకూలముగా నున్నవనియు, ఆయన విని అంగీకరించుననియు మనము నిశ్చయించుటకు "ఆమేన్" అనుచున్నాము. ఆమేన్ అను మాటకు నిజముగా ఆలాగు జరుగును అని అర్థము.

# పరిశుద్ధ బాప్తిస్మ సంస్కారము

మొదటిది

## పరిశుద్ధ బాప్తిస్మము అనగా నేమి?

**పరిశుద్ధ బాప్తిస్మము వట్టి నీళ్లు మాత్రమే కాదుగాని దేవుని ఆజ్ఞతో కూడి, ఆయన వాక్యముతో కలిసిన సంస్కారము.**

## ఆ దైవ వాక్యమేది?

"మీరువెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" అని మన ప్రభువైన క్రీస్తు చెప్పినది మత్తయి కడపటి అధ్యాయమందు కలదు.

రెండవది

## పరిశుద్ధ బాప్తిస్మము వలన కలుగు దీవెనలు ఏవి?

బాప్తిస్మమువలన పాప క్షమాపణ కలుగుచున్నది. మరణము నుండియు సాతాను నుండియు విడిపింపబడుచున్నాము. దేవుని వాక్య వాగ్దానములు ప్రకటించు ప్రకారము నమ్ము వారందరకు నిత్య మోక్షమియ్యబడుచున్నది.

## దేవుడిచ్చిన ఆ వాక్య వాగ్దానము లేవి?

"నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" అని మన ప్రభువైన క్రీస్తు చెప్పినది మార్కు కడపటి అధ్యాయమందు కలదు.

మూడవది

## ఇటువంటి ఘనమైన మేళ్ళు నీళ్లచేత ఏలాగు కలుగును?

నిశ్చయముగా వట్టి నీళ్లచేత కలుగవుగాని, నీళ్లతో చేర్చబడిన దైవ వాక్యము చేతను, నీళ్లతో చేర్చబడిన ఈ దైవ వాక్యమును విశ్వసించు విశ్వాసము చేతను ఈ ఘనమైన మేళ్ళు కలుగును. ఎట్లనగ దైవ వాక్యము లేని నీళ్లు వట్టి నీళ్లు మాత్రమేగాని పరిశుద్ధ బాప్తిస్మము కాదు. అయినను దేవుని వాక్యముతో చేర్చబడిన నీళ్లే పరిశుద్ధ బాప్తిస్మము. అనగా కృపగల జీవపు నీళ్ళు, పరిశుద్ధాత్మ ద్వారా కడిగి పునర్జన్మను కలుగజేయును.

## దీనిని గూర్చి ఎక్కడ వ్రాయబడియున్నది?

పరిశుద్ధుడైన పౌలు తీతుకు వ్రాసిన పత్రికలో మూడవ అధ్యాయమందు "మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను. మనమాయన కృప వలన నీతిమంతులమని తీర్చబడి, నిత్య జీవమునుగూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసులమగుటకై ఆ పరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మనమీద సమృద్ధిగా కుమ్మరించెను. ఈ మాట నమ్మదగినది గనుక దేవుని యందు విశ్వాసముంచినవారు సత్ క్రియలను శ్రద్ధగా చేయుటయందు

మనస్సుంచునట్లు నీవీ సంగతులనుగూర్చి దృఢముగా చెప్పుచుండవలెనని కోరుచున్నాను. ఇవి మంచివియు మనుష్యులకు ప్రయోజనకరమైనవియునై యున్నవి" అని చెప్పెను.

నాల్గవది

### నీళ్లతో బాప్తిస్మమిచ్చుట దేనిని సూచించును?

మనలోనున్న పాత ఆదాము సకల పాపములతోను, దురేచ్ఛలతోను ప్రతిదినము మనో దుఃఖము వలనను పశ్చాత్తాపము వలనను మునిగి చావవలెననియు, దేవుని సముఖమందు నీతిమంతుడుగాను, పరిశుద్ధుడుగాను ఎల్లప్పుడును బ్రదుకు క్రొత్త మనుష్యుడు ప్రతిదినము ప్రతివానిలో తిరిగి పుట్టి లేవవలెననియు సూచించుచున్నది.

### దీనిని గూర్చి ఎక్కడ వ్రాయబడియున్నది?

పరిశుద్ధుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో ఆరవ అధ్యాయము నందు "తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, అలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమునలన మరణములో పాలు పొందుటకై ఆయనతోకూడ పాతిపెట్ట బడితిమి" అని వ్రాయబడి యున్నది.

## పరలోకపు తాళపు చెవుల ఉపయోగము మరియు ఒప్పుకోలు

### పరలోకపు తాళపు చెవులు

మొదటిది

### పరలోకపు తాళపు చెవులవలన ఉపయోగమేమి?

పరలోకపు తాళపు చెవుల వలన ఉపయోగమేమనగా, అది క్రీస్తు తన సంఘమునకు భూమి మీద పశ్చాత్తాప్తులైన పాపుల యొక్క పాపములను క్షమించుటకును, పశ్చాత్తాపము పొందని ప్రజలకు పశ్చాత్తాపము పొందనంతవరకు పాపక్షమాపణ ఇవ్వకుండ తిరస్కరించుటకును ఇచ్చిన తన ప్రత్యేక అధికారమును హక్కునై యున్నది.

### దీనిని గూర్చి ఎక్కడ వ్రాయబడియున్నది?

పరిశుద్ధుడైన యోహాను, తన సువార్త 20వ అధ్యాయము నందు "యేసు వారి మీద ఊది - పరిశుద్ధాత్మను పొందుడి. మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును; ఎవరి పాపములు మీరు నిలిచియుండనిత్తురో అవి నిలిచియుండునని వారితో చెప్పెను" అని వ్రాసెను.

రెండవది

### క్రైస్తవ సంఘము పరలోకపు తాళపు చెవులను ఏ విధముగా ఉపయోగించును?

క్రైస్తవ సంఘము తమ సంఘములో క్రమముగా సేవకై పిలువబడిన పాస్టరు గారితో, క్రీస్తు ఆజ్ఞ ప్రకారము, పరలోకపు తాళపు చెవులను ఈ విధముగా ఉపయోగించును, ఎవరైతే వారి పాపమును బట్టి పశ్చాత్తాపపడి వాటిని దిద్దుకొనుటకు యిష్టపడుదురో వారిని క్షమించుచు, పశ్చాత్తాపపడని వారిని వారు పశ్చాత్తాపము పొందు నిమిత్తము తమ సంఘము నుండి తొలగించును.

ఇది జరిగినప్పుడు, మన ప్రియ ప్రభువైన క్రీస్తు తనంతట తానే మనకు ఆ ప్రకారము జరిగించినట్లు, ఇది పరలోకమందు కూడ నిక్కమైనదని నేను నమ్ముచున్నాను.

### దీనిని గూర్చి ఎక్కడ వ్రాయబడియున్నది?

మత్తయి సువార్త 18వ అధ్యాయమునందు "భూమిమీద మీరు వేటిని బంధింతురో, అవి పరలోకమందును బంధింపబడును; భూమిమీద మీరు వేటిని విప్పుదురో, అవి పరలోకమందును విప్పబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని యేసు చెప్పెను.

## ఒప్పుకోలు

మొదటిది

### ఒప్పుకోలు అనగానేమి?

ఒప్పుకోలు రెండు భాగములు కలిగియున్నది. మొదటిది మనము మన పాపములను ఒప్పుకొందుము, రెండవది మన పాపములు పరలోకమందున్న దేవుని ఎదుట క్షమింపబడి

యున్నవని సందేహింపక దృఢముగా నమ్ముచు, పాపక్షమాపణను దేవుని నుండే పొందినట్లు పాస్టరుగారి నుండి పొందెదము.

రెండవది

## మనము ఏయే పాపములను ఒప్పుకొనవలెను?

దేవుని ఎదుట మన పాపములన్నింటి యొక్క అపరాధమును ఒప్పుకొనవలెను. మనము తెలియక చేసిన వాటిని కూడ ప్రభువు ప్రార్థనలో అడుగు విధముగా ఒప్పుకొనవలెను. గాని పాస్టరుగారి యెదుట మనకు తెలిసిన మరియు హృదయములో బాధపడుచున్న పాపములను గూర్చి ఒప్పుకొనవలెను.

మూడవది

## ఈ పాపములను మనము ఎట్లు గుర్తించగలము?

పది ఆజ్ఞల ప్రకారము జీవితములో నీకు ఏ స్థానమున్నదో గమనించుము. నీవు తండ్రివా, తల్లివా, కుమారుడువా, కుమార్తెవా, ఉద్యోగివా లేక యజమానివా? నీవు అవిధేయుడవుగానో, నమ్మకములేనివాడవుగానో, సోమరిగానో నున్నావా? మాటద్వారాగాని, క్రియద్వారాగాని నీవు ఎవరినైనా గాయపరచినావా? అవినీతిగానైనను, అజాగ్రత్తగానైనను, వృధా పుచ్చుటవలనైనను మరియే విధముగానైనను నీవు తప్పు చేసితివా?

నాల్గవది

## పశ్చాత్తాపుడైన పాపికి పాస్టరుగారు పాపక్షమాపణ ఎట్లు ప్రకటించి ఆదరణనియ్యగలడు?

“మన ప్రభువైన యేసుక్రీస్తు యిచ్చిన ఆజ్ఞను బట్టి, తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున నీ పాపములను క్షమించుచున్నాను. ఆమేన్.” అని పాస్టరుగారు చెప్పుట ద్వారా ఆదరణ నిచ్చును.

# పరిశుద్ధ ప్రభురాత్రి భోజన సంస్కారము

## ప్రభురాత్రి భోజన సంస్కార నియమము

మొదటిది

### పరిశుద్ధ ప్రభురాత్రి భోజన సంస్కారము అనగా నేమి?

ఇది మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క నిజమైన శరీరమును రక్తమునై యున్నది. క్రైస్తవులమైన మనకొరకు దీనిని రొట్టెతోను, పులిసిన ద్రాక్షరసముతోను తిని త్రాగుటకు క్రీస్తే ఈ రాత్రి భోజనమును నియమించెను.

### దీనిని గూర్చి ఎక్కడ వ్రాయబడియున్నది?

పరిశుద్ధ సువార్తికులగు మత్తయి, మార్కు, లూకా మరియు అపొస్తలుడైన పౌలు మనకు ఈలాగు చెప్పెను. మన ప్రభువైన యేసుక్రీస్తు తాను అప్పగింపబడిన రాత్రి రొట్టె పట్టుకొని స్తోత్రముచేసి, దానిని విరిచి తన శిష్యులకిచ్చి, "మీరు తీసికొని తినుడి, ఇది మీ కొరకియ్యబడుచున్న నా శరీరము. నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని చెప్పెను." ఆ ప్రకారమే వారు భోజనము చేసిన తరువాత ఆయన పాత్రను తీసికొని స్తోత్రముచేసి, దానిని వారికిచ్చి, దీనిలోనిది మీరందరు త్రాగుడి, "ఇది నా రక్తము, అనగా పాప క్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న క్రొత్త నిబంధన రక్తము. మీరు దీనిలోనిది త్రాగునపుడెల్ల, నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడ"ని చెప్పెను.

## ప్రభురాత్రి భోజన సంస్కారము యొక్క ఆశీర్వాదములు

రెండవది

### వీటిని తినుట త్రాగుట వలన మనము ఎలాంటి ఆశీర్వాదము పొందెదము?

"మీ కొరకియ్యబడినది మరియు చిందింపబడినది" అను ఈ మాటలు మనకు పాప క్షమాపణను తెలియజేయుచున్నవి.

"పాపక్షమాపణ నిమిత్తము మీ కొరకియ్యబడినది మరియు మీ కొరకు చిందింప బడినది," అను ఈ మాటలు మనకు తెలియజేయబడుచున్నవి. ఈ మాటల ద్వారా

మనము ఈ సంస్కారములో పాపక్షమాపణను, రక్షణను, జీవమును, పొందెదము. ఎందుకనగా ఎక్కడైతే పాపక్షమాపణ కలదో అక్కడ రక్షణ మరియు జీవము, కూడ వుండును.

## ప్రభురాత్రి భోజన సంస్కారము యొక్క శక్తి

మూడవది

**తినుట మరియు త్రాగుట వలన ఇటువంటి ఘనమైన మేళ్ళు ఏలాగు కలుగును?**

తినుట మరియు త్రాగుట వలన నిశ్చయముగా ఇటువంటి ఘనమైన మేళ్ళు కలుగవు గాని, "పాపక్షమాపణ నిమిత్తము" "మీ కొరకు ఇయ్యబడిన" దనియు, "మీ కొరకు చిందింపబడిన" దనియు, చెప్పబడు ఈ మాటలవలన కలుగును. తినుట, త్రాగుటతో కూడ ఈ మాటలు ఈ సంస్కారములో ప్రధానమైనవి. మరియు ఈ మాటలు విశ్వసించువానికి పాపపరిహారము కలుగుచున్నది.

## ప్రభురాత్రి భోజనము కొరకు సిద్ధపడుట

నాల్గవది

***ఈ సంస్కారమును పొందుటకు సరియైన విధముగా సిద్ధపడినవారు ఎవరు?***

ఉపవాసము మరియు ఇతర బాహ్య సంబంధమైన ప్రయాసములు కొంత సిద్ధబాటును కలిగించవచ్చును. గాని, ఎవరైతే "పాపక్షమాపణ నిమిత్తము" "మీకొరకు ఇయ్యబడిన" దనియు, "మీ కొరకు చిందింపబడినద"నియు చెప్పబడు ఈ మాటలను నమ్మెదరో వారే బాగుగా సిద్ధపడిన వారైయున్నారు. గాని ఎవరైతే ఈ మాటలను నమ్మక సందేహించెదరో వారు సిద్ధపడనివారు, ఎందుకనగా "మీ కొరకు" అను మాటలకు విశ్వసించు హృదయములే అవసరము.

# ప్రభురాత్రి భోజనము తీసుకొనుటకు సిద్ధపడుచున్న క్రైస్తవునికి ప్రశ్నలు

1. నీవు పాపివని నమ్ముచున్నావా?

జ. **అవును, నేను పాపినని నమ్ముచున్నాను.**

2. అది నీకు ఎట్లు తెలియును ?

జ. **నేను నెరవేర్చవలసిన పది ఆజ్ఞలను నెరవేర్చలేకపోయినందున ఈ విషయము నాకు తెలియును.**

3. నీ పాపముల విషయమై నీవు దుఃఖపడుచున్నావా ?

జ. **అవును, దేవునికి వ్యతిరేకముగ నేను పాపము చేసినందుకు దుఃఖపడుచున్నాను.**

4. నీ పాపములను బట్టి దేవుని నుండి నీవు యేమి పొందుటకు అర్హుడవు ?

జ. **నేను దేవుని యొక్క ఉగ్రత, అసంతృప్తి, మరియు ఈ లోక సంబంధమగు మరణము, నిత్య నరకము పొందుటకు అర్హుడను.**

5. నీవు రక్షింపబడియున్నావనే నమ్మకము నీకు ఉన్నదా?

జ. **అవును, అదే నా నమ్మకము.**

6. అయితే నీవు ఎవరిమీద నమ్మకము పెట్టుకొనియున్నావు?

జ. **నా ప్రియ ప్రభువైన యేసు క్రీస్తు మీద నమ్మకము పెట్టుకొనియున్నాను.**

7. యేసుక్రీస్తు ఎవరు?

జ. **యేసుక్రీస్తు దేవుని కుమారుడు, నిజ దేవుడు, నిజమానవుడైయున్నాడు.**

8. ఎంతమంది దేవుళ్ళు ఉన్నారు?

జ. **దేవుడొక్కడే, కానీ తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను ముగ్గురు వ్యక్తులున్నారు.**

9. క్రీస్తునందు నమ్మకముంచుటకు ఆయన నీకు ఏమి చేసియున్నాడు?

జ. **ఆయన నా పాపక్షమాపణ కొరకు కల్వరి సిలువ మీద రక్తము కార్చి నా కొరకు చనిపోయెను.**

10. తండ్రియైన దేవుడు నీ కొరకు కూడా చనిపోయెనా?

జ. **తండ్రి చనిపోలేదు. ఎందుకనగా తండ్రి దేవుడు మాత్రమే. అలాగే పరిశుద్ధాత్ముడు కూడా. కానీ కుమారుడు నిజ దేవుడును, నిజమానవుడై యున్నాడు. ఈ కుమారుడే తన రక్తమును చిందించి నా కొరకు చనిపోయెను.**

11. ఇది నీకు ఎలా తెలియును?

జ. **పరిశుద్ధ సువార్తను బట్టియు ప్రభు రాత్రి భోజన సంస్కారమునందు చెప్పబడు మాటలను బట్టియు నాకు తెలియును.**

12. ఆ మాటలు ఏవి?

జ. **ప్రభువైన యేసుక్రీస్తు తాను అప్పగింపబడిన రాత్రి రొట్టెను పట్టుకొని, స్తోత్రము చేసి దానిని విరిచి తన శిష్యులకిచ్చి, "తీసుకొని తినుడి, ఇది మీకొరకియ్యబడిన నా శరీరము, నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడి" అని చెప్పెను.**

**ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను తీసుకొని స్తోత్రము చేసి, "దీనిలోనిది మీరందరును త్రాగుడి. ఇది మీ కొరకును, అనేకుల కొరకును చిందింప బడుచున్న క్రొత్త నిబంధన వలననైన నా రక్తము. దీనిని త్రాగునపుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకు" దీనిని చేయుడని చెప్పెను.**

13. పరిశుద్ధ సంస్కారమునందు యేసు ప్రభువు యొక్క నిజ శరీరము నిజరక్తము ఉన్నవని నీవు నమ్ముచున్నావా ?

జ. **అవును నేను నమ్ముచున్నాను.**

14. దేనిని బట్టి నీవు దీనిని నమ్ముచున్నావు?

జ. **"తీసుకొని తినుము ఇది నా శరీరరము"... "దీనిలోనిది మీరందరు త్రాగుడి ఇది మీకొరకు చిందింపబడిన క్రొత్త నిబంధన వలననైన నా రక్తమై యున్నది," అన్న క్రీస్తు మాటలను బట్టి నేను నమ్ముచున్నాను.**

15. ప్రభురాత్రి భోజన సంస్కారమునందు క్రీస్తు తన యొక్క శరీరము మరియు రక్తములను తిని త్రాగునప్పుడు మనము యేమి చేయవలెనని కోరుచున్నాడు?

జ. **"దీనిలోనిది మీరు త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసుకొనుటకు దీనిని చేయుడి", అని యేసు చెప్పెను. తినుటవలనను త్రాగుటవలనను, ఆయన మరణమును, ఆయన రక్తము చిందించుటను జ్ఞాపకము చేసికొని దానిని ప్రకటించవలెనని క్రీస్తు కోరుచున్నాడు.**

16. యేసుక్రీస్తు తన మరణము జ్ఞాపకముంచుకొని దానిని ప్రకటించమని ఎందుకు కోరుచున్నాడు ?

జ. **ఆయన దీనిని చేయమని కోరుచున్నాడు. ఎందుకనగా అట్లు చేయుటచే (1) ఏ జీవియు నా పాపములకు ప్రాయశ్చిత్తము జరుపలేరనియు, నిజ దేవుడు, నిజమానవుడైన క్రీస్తు ఒక్కడు మాత్రమే దానిని నా కొరకు చేయగలడనియు, చేసెననియు నమ్ముటను నేను తెలుసుకొనుచున్నాను. (2) నా పాపములు అవి ఎంత భయంకరమైనవో చూచుటకు నేను తెలుసుకొనుచున్నాను.**

17. నీ పాపముల కొరకు సంపూర్ణ మూల్యమును చెల్లించి, మరణించుటకు ఆయనను యేమి నడిపించెను ?

జ. **యేసు ప్రభువునకు తన తండ్రిపైన, నా మీద మరియు యితర పాపులందరి మీద ఉన్న ప్రేమయే ఆయనను ఇట్లు చేయుటకు నడిపించినదని బైబిలు బోధించుచున్నది. (యోహాను 14:31; రోమా 5:8; గలతీ 2:20; ఎఫెసీ 5:2).**

18. అయితే నీవు ప్రభురాత్రి భోజనము పొందుటకు ఎందుకు ఆశపడుచున్నావు?

జ. **క్రీస్తు అత్యంతమైన ప్రేమలో నా పాపముల కొరకు చనిపోయెననియు ఆయన ద్వారా దేవుని ప్రేమించుట, నా పొరుగువానిని ప్రేమించుట అనునది నేను తెలుసుకొని యున్నాను.**

19. తరచుగా ప్రభురాత్రి భోజన సంస్కారములో పాలుపొందునట్లుగ నిన్ను యేది హెచ్చరించి నడిపించుచున్నది?

జ. **నా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ఆజ్ఞలు, వాగ్ధానములు నన్ను అట్లు హెచ్చరించి, నడిపించుచున్నవి. నా మీద భారముగనున్న నా పాపము ప్రభురాత్రి భోజనములో పాలుపొందుటకు నన్ను ఆకలి దప్పులు గలవానిగా చేయుచున్నవి.**

20. ఒక మనుష్యుడు తన పాపభారమును ఎరుగక ప్రభురాత్రి భోజనములో పాలుపొందుటకు ఆకలి దప్పులు లేని యెడల ఆ మనుష్యుడు యేమి చేయగలడు?

జ. **అట్టి మనుష్యుడు మొదటిగా తన చేతిని హృదయము మీద పెట్టుకొని తనలో శరీరము రక్తము ఉన్నట్టు భావన కలిగియున్నాడో లేదో పరీక్షించుకొని అన్ని విధాల యీ విషయములో లేఖనములు ఏమి చెప్పుచున్నవో అతడు నమ్మవలెను. (గలతీ 5:17,19-21; యెషయా 64:6, రోమా 7:18.)**

**రెండవదిగా దేవుని వాక్యము చెప్పిన రీతిలో తాను చుట్టునున్న లోకమును చూచి, అతడు ఇప్పటికి ఈలోకములో ఉన్నాడోలేడో అని చూచుకొనవలెను. లేఖనముల ప్రకారము పాపమునకు శ్రమలకు కొదువ యేమియు ఉండదనియు తాను జ్ఞాపకముంచు కొనవలెను. (యోహాను 15:18-25, మత్త. 24:9-13, అపో.కార్య. 14:22).**

**మూడవదిగ దేవుని వాక్యము కనపరచునట్లుగ రాత్రింబవళ్ళు అబద్ధమాడుచు, నరహత్య చేయుచు తిరుగాడు సాతాను అతనికి శాంతి లేకుండ విడిచిపెట్టదని అతడు నిశ్చయముగా తెలిసికొనవలెను. (యోహాను 8:44, 1 పేతురు 5:8; ఎఫెసీ 6:10-12, 2 తిమోతి 2:26).**

21. ఒక వేళ నీకు జబ్బుచేసి ప్రభురాత్రి భోజనమునకు రాలేని పరిస్థితులలో నీవేమి చేయవలెను?

జ. **అప్పుడు నా పాస్టరుగారు వచ్చి నాతో ప్రార్థించుటకు, నాకు ఒంటరిగానే ప్రభురాత్రి భోజనము యిచ్చుటకు ఆయనను పిలువనంపుదును.**

22. ఇట్లు చేయుటకు యుక్తమైన సమయమేది ?

జ. **కేవలము మరణము సమీపించినప్పుడు మాత్రమేగాక మానసికముగా శారీరకముగా క్షీణింపకముందే అట్లు చేయవలెను.**

23. ఎందుకు నీవు దీనిని చేయవలయునని కోరుచున్నావు ?

జ. **ప్రభురాత్రి భోజనము ద్వారా నా పాపములు క్షమింపబడినవనియు రక్షణ నాదేయని నిశ్చయము పొందుటకు ఇందులో పాలుపొందగోరుచున్నాను.**

## 1. శిశు బాప్తీస్మము

రా-నాదనామ క్రియ తా-ఆట

దేవా శిశువులఁ దెచ్చితిమి - నీవు- దీవించువీరల - దివ్య కృపమీర ॥దేవా॥

1. వీరు పొందిన బాప్తిస్మంబు-గురుతు-వీరు నీవా రన-విశదపరపంగా-వీరిపైఁ గురిపించు దయను -వేగ- వీరికిఁ గలుగంగ - విజ్ఞాన ధనము ॥దేవా॥
2. నీ వొసగు శిశువుల మాకు - దేవ నీవ చేర్చికొనుము-నీవ కాపాడు-జీవ మార్గము నందు నిలుపు - నిత్య-జీవంబు దయచేసి - శ్రీ యేసు కతనన్ ॥దేవా॥
3. విమలాత్మ బాప్తిస్మ మొసఁగి - వీరి- విమలులఁ జేయుము - ప్రీతిని దేవా-క్షమ భక్తి ప్రేమ శాంతుల-నొసంగు-శ్రమముల వెలుఁగంగ-సత్య సాక్షులుగా ॥దేవా॥
4. వీరలకుఁ దోడై యుండుము-తండ్రి- వీరలఁ జూడుము - వివిధ మార్గముల- వీరు లోకము విడుచునపుడు -దయను-వీరలఁ జేర్చుము విమలానందమున ॥దేవా॥

- పులిపాక జగన్నాథము

## 2. పిన్న పెద్దల బాప్తిస్మము

రా-నీలాంబరి (ఛాయ: వారు భాగ్యవంతులు) తా-త్రిపుట

యే సొసంగె గొప్ప యాజ్ఞను - తన శిష్యులకును - యేసొసంగె గొప్ప యాజ్ఞను = దాసులునుగఁ జేయ బోయి-ధరణిమీఁది రాష్ట్రములకు-ఆసను బాప్తిస్మ మిచ్చి - నా సుబోధ నేర్పుఁ డనుచు ॥యేసొసంగె॥

1. జనక కుమారాత్మల పేర - బాప్తిస్మ మియ్యఁ -చనుడు మీరు సకల దిశలను = తనయులైనఁ తల్లులైన - తండ్రులైన బొందవచ్చుఁ - దగిన రీతి దాని నిపుడు - తండ్రియైన దైవ కృపను ॥యేసొసంగె॥
2. బాలు రెల్ల బొందవచ్చును - బాప్తిస్మ మిపుడు- జాలిఁ జూపు క్రీస్తు నెలవును = బాలు రందుఁ బ్రేమ నుంచి - ప్రభువు పిలుచు వారి నెల్లఁ - జాల మేలు సేయఁగోరి - సకల కాలములయందు ॥యేసొసంగె॥
3. పొందవలయు బాప్తిస్మము - శుద్ధాత్మచేత- నిందుఁ గలుగు మనుజులందరు = మంద బుద్ధి విడిచి పెట్టి - మహిమ గల్గు దేవు గొల్వ - నందముగను లేచి రండి - హర్ష పూర్ణులగుచు మీరు ॥యేసొసంగె॥

- పులిపాక జగన్నాథము

### 3. There is a fountain filled with blood

1. ఇమ్మానుయేలు రక్తము
ఇంపైన యూటగు
ఓ పాపి! యందు మున్గుము
పాపంబు పోవును
యేసుండు నాకు మారుగా
ఆ సిల్వఁ జావఁగా
శ్రీయేసు రక్త మెప్పుడు
స్రవించు, నాకుగా॥

2. ఆ యూట మున్గి దొంగయు
హా! శుద్ధుఁడాయెను
నేనట్టి పాపినిప్పుడు
నేనందు మున్గుదు. ॥యేసుండు॥

3. నీ యొుక్క పాప మట్టిదే
నిర్మూల మౌటకు
రక్షించు గొఱ్ఱెపిల్ల నీ
రక్తంబె చాలును. ॥యేసుండు॥

4. నా నాధు రక్తమందున
నే నమ్మి యుండినను
నా దేవుని నిండు ప్రేమ
నేనిందుఁ జూచెదన్. ॥యేసుండు॥

5. నా యా యూష్కాల మంతట
నా సంతసం బదే
నా క్రీస్తుయొుక్క రొమ్మునన్
నా గాన మిద్దియే ॥యేసుండు॥

- విలియం కౌపర్

### 4. జీవాహారము

రా-ముఖారి (ఛాయ : నాకై చీలిన యుగయుగములు) తా-ఆది

జీవాహారమ రము, - చిరజీవాన్నము నిచ్చి - జీవిత క్షుద దీర్చుము = జీవన పథములో
- చీకటి పడువేళ - జీర్ణించుకొనిపోవు - జీవితాశలఁ బెంచ ॥జీవా॥

1. విందు గృహమునకేగి - వీక్షింతు భ్రమతో నీ - వివిధ సుభోజ్యంబులన్ = విచ్ఛిన్నమైన నీ - విమలదేహపు విందు - వికలంబౌ మనసుతో - వినుతించి, తినుచుందు ॥జీవా॥

2. రుధిర ధారలలోన - ఋజువౌ నీ ప్రేమలు - రూపుమాయును పాపము = ఋత ద్రాక్ష వల్లీ నీ - రుధిర పానము చేత - ఋణ భారములు దీరి - రుచియించు నా బ్రతుకు ॥జీవా॥

3. భవదీయ స్మరణార్థం - పతితుల శరణార్థం - ఫలియించు యీహోమము = ప్రభువా నా యాత్మలో - ప్రతిబింబమై వెలసి-పానార్పణంబౌను-ప్రతిరక్త బిందువు ॥జీవా॥

4. ఆత్మాంతఃపురములో - ఆంతర్య గదిలోన - ఆరాధింతు నీ నామము = అలనాటి నీ రక్త - నవనిబంధన నేడు - అపురూపమై నాలో - నవతరించును దేవా ॥జీవా॥

- ఎ.బి. మాసిలామణి

## 5. ప్రభు సంస్కారపు విందు

పల్లవి : ప్రభు సంస్కారపు విందు - ప్రభు సంసారపు విందు -
పరుగెత్తుకొనిరండి - ప్రభువే మన విందు - ప్రభువు
జతకిదే సందు - పాప వ్యాధికి మందు - సభలన్నిటియందు
సంతుష్టి పెంపొందు ॥ప్రభు॥

1. అందుకొను రొట్టెతో ఆయన శరీరము - నందుకొందుము
మర్మ మదియద్భుతంబు - యెందరెన్నో మార్లీవందల
ఏండ్లలో వధించి తిన్నను - బాధయు తరుగులేదు ॥ప్రభు॥

2. అందుకొను రసముతో - ఆయన రక్తము - నందు
కొందుము మర్మ - మది యద్భుతంబు - యెందరెన్నో
మార్లీ - వందల ఏండ్లలో - వదించి త్రాగినను బాధయు తరుగులేదు ॥ప్రభు॥

3. మనరక్షకుడు దేవతనయుండు రండని - కనిపెట్టుచున్నాడు
గనుకనేరండి - మనసులోని అడ్డులను - నొత్తిగించి మీ
మనసు ప్రభువునకిచ్చి వెనుకాడకను రండి ॥ప్రభు॥

4. పాపాత్ములందరికి ప్రభువే స్వయంబుగా - బంతి భోజనము
యే-ర్పరచి యున్నాడు - పాపులేక సహవాసులై యేసుని
దాపున నొక సభగా - ధన్యులౌ విడిదియే ॥ప్రభు॥

5. పాపి పాపియంచు ప్రభువు కలవరించు - ప్రభువు ప్రభువని
కలవరించు చుండుము - నా పాపి విందునకు - నడచిరాకున్న
నా తాపమెంతో చెప్ప-దగు నాయనుచున్నాడు ॥ప్రభు॥

6. భోజన వస్తువులు - భుక్తికి గుర్తులు - భోజన వస్తువులు
భుక్తి సాధనముల్ రాజు మన తండ్రి ఈ రాత్రి భోజన
కర్తయే జనవిశ్వాసికిని - యేసును వడ్డించును ॥ప్రభు॥

## 6. ప్రభురాత్రి భోజనము కొరకు సిద్ధపడుట

రా-ఆనందభైరవి (ఛాయ : ఓమా తండ్రి) తా-ఏక

మనస! యాత్మ! తేజరిల్లుమా - యలంకరించు - కొనుము పాప మంత వీడుమా
= వినుము నేఁడు యేసు నీకు - ఘనముగాను విందుఁ జేసి - నినుఁదలంచి చేరవచ్చె
- ఘనుని వెల్గులోని కేగుము ॥మనస॥

1. హృదయ మనెడు తలుపుఁ దట్టుచుఁ - ప్రభు యేసు నిలిచి - సదయుండిదిగో
నిన్నుఁ బిలుచుచు = ఎదురు జూచుచుండు విభుని - పదయుగమున కెరిగి మ్రొక్కి
- ముదముతోడఁ జేర్చుకొనుము - సదమల మగు ప్రేమజూపి ॥మనస॥

2. ధరను సర్వశ్రేష్ఠ భాగ్యముల్ - వరములును ధనము - నరులు బొందుచుందు
రుచితము = పరమ రక్షకుండొసంగు - వర శరీర రక్తములకు ధరణి రత్న రాసులైనఁ
- జాలునా మరేవి యైన ॥మనస॥

3. ఎదుఁ గానరాని ప్రేమను - జూపించి నీకై - పొందుగాఁ దన ప్రాణమిచ్చెను =
చిందిన రక్తమును యాగ - మంది నట్టి శరీరంబు - నందముగను రాత్రి భోజ-
నంబు నందు సిద్ధపరచె ॥మనస॥

4. యేసు తనదు బల్లమీదఁను - సుజీవ మిచ్చు - నెల్ల నష్టములు నశించును =
భాసురమ్ముగ మోక్షమునని - వాసివై శ్రీ యేసుతోడ- యీ సుభోజనంబు దినుట -
కాశీర్వాదముల నొసంగు ॥మనస॥

- రావూరి దావీదు

☆ ☆ ☆